www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం శనివారం 15.02.2025



2లో

## రాహుల్‌గాంధీ కన్వర్టెడ్ హిందూ


### ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- పదవిని కాపాడుకోవడం కోసం మోదీ కులంపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు
- ముఖ్యమంత్రి అన్నింటా విఫలమయ్యారు
- రాహుల్ గాంధీ మాట్లాడినట్లుగానే సీఎం మాట్లాడుతున్నారు



పుల్వామాలో 2019 సంవత్సరంలో ఫిబ్రవరి 14న అమరులైన జవాన్లకు నిర్మల్ పట్టణంలోని జెవీఎస్ఆర్ పాఠశాలలో చిన్నారులు మృత వీరుల స్మృతి సూచకంగా కొవ్వొత్తులు వెలిగించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అంతకు ముందు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మణి కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

– కలంజ్యోతి, నిర్మల్



# బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్!

## భారీగా తగ్గిన చికెన్ అమ్మకాలు!

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 'బర్డ్ ఫ్లూ' భయాందోళన కలిగిస్తోంది. కోళ్లకు వైరస్ సోకి పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో.. జనాలు చికెన్ తినేందుకు భయపడుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సగానికి పైగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. హైదరాబాద్‌లో నిత్యం దాదాపుగా 6 లక్షల కిలోల చికెన్ సేల్ అవుతుంది. గత 23 రోజులుగా 50 శాతం కూడా సేల్స్ లేవని వ్యాపారులు అంటున్నారు. గిరాకీ లేక చికెన్ దుకాణాలు ఖాళీగా మారాయి.

దానికి తోడు రోజూ నగరంలో అక్కడక్కడ కుళ్లిన చికెన్ నిల్వలు బయటపడుతున్నాయి. దాంతో చికెన్ ముట్టుకోవడానికి నగర వాసులు జంకుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో కూడా చికెన్ మెనూ ఆర్డర్లు పూర్తిగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్‌కు బదులుగా.. మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. దాంతో మటన్, చేపలకు భారీగా గిరాకీ పెరిగింది. పటాన్ చెరువులోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇన్స్టా హాట్ ఫుడ్స్, రాజ్ కుమార్ రోలర్ ఫ్లోర్ మిల్స్ లు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని అధికారులు గుర్తించారు. గడువు ముగిసిన మెంతులు, ఆవాలు వాడుతున్నట్లు తేల్చారు. ప్రాసెసింగ్ యూనిట్లో బొద్దింకలు, పురుగులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అపరిశుభ్రంగా ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకులు కుళ్లిపోయిన కూరగాయలు వాడుతున్నట్లు పేర్కొన్నారు. ఫుడ్ ఐటమ్స్ తో పాటు సిమెంట్‌ను పక్క పక్కనే నిర్వాహకులు స్టోర్ చేశారు. ఇన్స్టా హాట్ ఫుడ్స్ 'ఇండిగో ఎయిర్ లైన్స్'కి ఫుడ్ సప్లై చేస్తున్నారు.



# రాహుల్ గాంధీ కన్వర్టెడ్ హిందూ

## ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ మెప్పు కోసం, తన పదవిని కాపాడుకోవడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులంపై వ్యాఖ్యలు చేశారని తెలంగాణ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. పాలనలో రేవంత్ విఫలమయ్యారని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. రేవంత్ రెడ్డి ఒక ఫ్రస్ట్రేటెడ్ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. అన్నింటా విఫలమయ్యారు కాబట్టి ఉద్దేశపూర్వకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రాహుల్ గాంధీ ఏ విధంగా మాట్లాడారో ఇప్పుడు రేవంత్ రెడ్డి అదేతరహాలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక బీసీ ప్రధానమంత్రిగా పదేళ్లు ఉంటే చూసి ఓర్వలేకనే రేవంత్ రెడ్డి పిచ్చికూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీది ఏ కులం, ఏ మతమో చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ కన్వర్టెడ్ హిందువు కాదా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అసలు మతం ఏమిటో చెప్పాలన్నారు. కన్వర్టెడ్ హిందువు అయిన రాహుల్ గాంధీ ఇది వరకు నరేంద్రమోదీపై మాట్లాడారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అలాగే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాదు ప్రాంతీయ ఆధార్ కార్యాలయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆధార్ కేంద్రాలలో సులువుగా ఆధార్ నమోదు, పేరు, చిరునామా తదితర వివరాలు మార్పులు, చేర్పులు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి ప్రధాన తపాలా కార్యాలయంలో పూర్తిస్థాయి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని నూతన ఆధార్ కార్డు, ఆధార్ లో మార్పు చేర్పులు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్ సేవలలో సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులలో ఆధార్ సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో శిశువులు జన్మించిన వెంటనే వారి తల్లిదండ్రుల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని శిశువులకు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ కార్డులలో మార్పులు చేర్పులకు సంబంధించి సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. త్వరలోనే ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి, ఆధార్ కార్డులలో తప్పుగా ముద్రించబడిన వివరాలను సరిచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పాఠశాలలను విద్యార్థుల యొక్క ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నట్లుగా గుర్తిస్తే వాటిని సరి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిఈఓ పి. రామారావు, పోస్ట్ మాస్టర్ వెంకటరావు, డిటిడివో అంబాజీ, సిడిపివో నాగలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గీతా కార్మికులకు రక్షణ కిట్ శిక్షణ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** ముస్కానిపేట రహీంఖాన్ పేట వంతడుపుల గ్రామాలలోని గీతా కార్మికులకు మండల కేంద్రంలోని తాటివనంలో కాటమయ్య రక్ష కిట్ ఏ విధంగా ఉపయోగించాలో శిక్షకులు గీత కార్మికులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. 50 మంది గీతా కార్మికులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శిక్షకులు జాగిరి అంజయ్య గౌడ్, పొన్నం వెంకటేశం గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, శ్రీనివాస్, గౌడ సంఘాల అధ్యక్షులు కొయ్యడ, రాజయ్యగౌడ్. వి అంజయ్యగౌడ్, నాగుల చంద్రయ్యగౌడ్, సార శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు మానాల యువకుడు

**కలంజ్యోతి, రుద్రంగి :** ఇటీవల నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, అండర్ 16 బాలురు, బాలికల అథ్లెటిక్ పోటీలు జిల్లాకేంద్రంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో అథ్లెటిక్స్ నిర్వహించగా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన శివ చరణ్ కమ్మర్ పల్లి మండలంలోని శ్రీవిద్యాసాయి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు, జిల్లాలో నిర్వహించిన అథ్లెటిక్స్ లో షాట్ పూట్ విభాగంలో అత్యంత ప్రతిభకనబర్చి జిల్లా మొదటి స్థానంలో నిలువడంతో పాటు అలాగే మిగితా విద్యార్థులు లాంగ్ జంప్, షాట్ పుట్ విభాగాల్లో మంచి ప్రతిభ తో ఓవరాల్ ఛాంపియన్ షిప్ లో రెండవ స్థానంలో నిలవడం జరిగిందని, ఈ నెల 18, 19 ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ ఏనుగు గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి శివ చరణ్ ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ జాను సుందర్, పవన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 2008 డీఎస్సీ బాధితులకు నియామక పత్రాలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ సర్కార్ 2008 డీఎస్సీ బాధితులకు గుడ్ న్యూస్ తెలిపింది. 2008 డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు టీచర్ ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1382 మందికి కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం కల్పిస్తూ స్కూల్‌ఎడ్యుకేషన్‌డైరెక్టర్‌ఈవీ నర్సింహరెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరి కాంట్రాక్టు విధానంలో ప్రతి నెల రూ.31040 వేతనంలో నియమించనున్నట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి సర్వీసు ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం చివరి రోజును ముగిసి తదుపరి విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విద్యాశాఖ అవసరాలకు అనుగుణంగా నియామకం చేసుకుంటారు. వీరికి ఉద్యోగాలు కల్పించనున్నట్లుగా కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. వీరికి ఉద్యోగాలు కాంట్రాక్టు విధానంలో ఇవ్వాలంటూ ప్రభుత్వం క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నది. దానికి అనుగుణంగా పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వీరు ఎన్ని సార్లు వేడుకున్న స్పందించలేదు. దీంతో వీరు కోర్టును ఆశ్రయించారు. వీరికి ఉద్యోగాల ఉత్వర్వులు ఇవ్వాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



కలంజ్యోతి
3
శనివారం 15.02.2025 Local News

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఇందుకోసం కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో 10వ తేదీ నుంచి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తా రహదారి విభాగినుల మధ్య మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచే పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కలెక్టర్ అన్నారు. సమాజంలో మెరుగైన పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులు కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పట్టణాన్ని స్వచ్ఛ నిర్మల్ గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిఈఓ పి. రామారావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డిఈ హరి భువన్, అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తెలంగాణ ఇంచార్జిగా మీనాక్షి నటరాజన్



**న్యూ ఢిల్లీ :** పలు రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ కొత్త ఇన్చార్జిలను ప్రకటించింది. 9 రాష్ట్రాలకు కొత్త ఇన్ ఛార్జులను ప్రకటించిన కాంగ్రెస్.. ఈ మేరకు ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే, తెలంగాణ కాంగ్రెస్ఇంచార్జిగాకొనసాగుతున్న దీపాదాస్ ను తొలగించిన ఏఐసీసీ.. తెలంగాణకు కొత్త ఇంచార్జిని నియమించింది. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జిగా మీనాక్షి నటరా జన్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మీనాక్షి నజరాజన్ 2009 లో మధ్యప్రదేశ్ లోని మాండసోర్ లోక్ సభ నుంచి ఎంపీగా పని చేశా రు. ఇక, ఆమె రాహుల్ గాంధీ టీమ్ లో కీలకంగా ఉన్నారు. అయతే, ప్ర స్తుతం తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ గా ఉన్న దీపాదాస్ మున్షీపై కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులు చేశారు. ఏకపక్షంగా మున్షీ నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. అలాగే, నాయకుల మధ్య సమన్వయం కుదర్చ లేకపోయారన్న విమర్శల నేపథ్యంలో ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇక, తెలంగాణతో పాటు హిమాచల్ ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, జార్ఖండ్, మణిపూర్, బీహార్ రాష్ట్రాల కాంగ్రెస్ కు కొత్త ఇన్ ఛార్జులు నియమించగా.. పంజాబ్, జమ్ము కశ్మీర్ కు కొత్త జనరల్ సెక్రటరీలను నియమించింది.

# మహాకుంభమేళాతో రూ.3లక్షల కోట్ల ఆదాయం

## సీఎం యోగి ఆదిత్యనాథ్



**లక్నో :** మహాకుంభ మేళా నిర్వహణ వల్ల వందల ఏళ్లుగా అణచివేయబడిన ప్రజల మనోభావాలను గౌరవించామని, దీంతో యూపీ ఆర్థిక వ్యవస్థ సమూల మార్పు చెందుతుందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. శుక్రవారం ప్రయాగ్ రాజ్ లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో యోగి మాట్లాడారు. కుంభమేళా నిర్వహణకు రాష్ట్రం రూ. 1500 కోట్లు ఖర్చు చేస్తే రూ. 3 లక్షల కోట్లు తిరిగి వస్తుందని అన్నారు. ఇంతపెద్ద సనాతన కార్యక్రమం ప్రపంచ చరిత్రలోనే ఎప్పుడూ కనివినీ జరగలేదని, ఎవ్వరూ ఊహించని విధంగా నిర్వహించామని అన్నారు. ఈ మహాకుంభమేళా ద్వారా దేశ విదేశాల్లోనూ యూపీ పేరు మారుమ్రోగిపోతుందన్నారు. 70 దేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా విచ్చేశారన్నారు. దేశంలోని ప్రయాగ్ రాజ్ లో 40 విమానాల ద్వారా రాకపోకలు కొనసాగాయన్నారు. వందలాది రైళ్లు, వేలాది రవాణ వ్యవస్థ బస్సులను తిప్పామన్నారు. మహాకుంభమేళా సనాతన, హిందూ ధర్మానికి గొప్ప విశ్వాస పర్వదినమని సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు.



# బాధిత కుటుంబానికి భరోసా

## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని సరోజినీ దేవిరోడ్డులో నివాసం ఉంటూ ఆటో మెకానిక్ పనిచేస్తున్న పుల్లూరి కర్ణాకర్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కర్ణాకర్ కుటుంబానికి మిత్రుడు వంగపండ్ల రాజు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి అండగా నిలవాలని తన వాట్సప్ స్టేటస్ ద్వారా కర్ణాకర్ కుటుంబ నేపథ్యాన్ని మిత్రులకు తెలియజేశాడు. వారి సహకారంతో సమకూరిన రూ.16,300 స్నేహితులతో కలిసి బాధిత కుటుంబానికి అందించాడు. కార్యక్రమంలో ఆకుల మహేష్, వైనాల రాజేష్, గుర్రం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వీరజవాన్ల త్యాగాలను మరువలేం





## డఫోడిల్స్ కరస్పాండెంట్ చింతల నరేందర్

**కలంజ్యోతి, నర్సంపేట :** పుల్వామా దాడిలో వీర మరణం పొందిన అమర జవాన్లల త్యాగాలను మరువలేమని డఫోడిల్స్ (సీబీఎస్ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్ అన్నారు. శుక్రవారం నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సీబీఎస్ఈ పాఠశాలలో పుల్వామా అమరవీరుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అమర జవాన్ల ఫొటోలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. పుల్వామా ఘటన 2019 ఫిబ్రవరి 14న జరిగిందన్నారు. ఈ ఘటనలో మన దేశానికి చెందిన ఆర్మీ జవాన్లు వీరమరణం పొందారని మాతృభూమి రక్షణ కోసం రాత్రనకా, పగలనకా కష్టపడుతున్న వీర జవాన్లకు నా బిగ్ సెల్యూట్ అంటూ.. వారిని ఆదర్శంగా తీసుకుని యువత దేశ రక్షణ కోసం ఏ త్యాగానికైనా వెనుకాడకుండా ముందుకు వెళ్లాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్, ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ రీటా, శశికల,హెచ్.ఆర్.డి విజయలక్ష్మి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

Cinema కలంజ్యోతి
శనివారం 15.02.2025



# నేను నమ్మను

బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని దివ్యంజలి ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్‌పై దినేష్ విజయన్ నిర్మించారు. ఇక ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో.. అక్షయ్‌ఖన్నా, అశుతోష్ రాణా, దివ్య దత్తా తదితరులు కీలక పాత్రలు పోషించారు. అయితే ఈ మూవీ లవర్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల అయి మంచి టాక్ అందుకుంది. ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా ఛావా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మక మందన్న నేషనల్ క్రష్ ట్యాగ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఆమె మాట్లాడుతూ.. 'ట్యాగ్స్ కెరీర్‌కు ఉపయోగపడతాయంటే నేను నమ్మను.. కొంత మంది అభిమానులు ప్రేమగా ఇలాంటివి ఇస్తుంటారు. ఏది ఏమైనా అవి కేవలం ట్యాగ్స్ మాత్రమే. మనం నటించే చిత్రాలు, ప్రేక్షకుల ప్రేమాభిమానాలే టికెట్ సేల్స్ పై ప్రభావం చూపిస్తాయి. అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చాను, 24 చిత్రాల్లో నటించాను. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని నా ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తున్నా' అని చెప్పకొచ్చింది.